
# అమ్మలగన్న అమ్మ

-ఓగేటి ఇందిరాదేవి



అర్ధరాత్రి- గండ్లూరు స్టేషన్లో రైలు ఆగింది. రైలు దిగి వడివడిగా తన గ్రామంవేపు నడవసాగాడు జ్వాలా రాఘవశాస్త్రిగారు. యాభై ఏళ్ళవాడైనా ఆయన బలంగానే వుంటాడు. కాయబారు మనిషి- ఒక కట్టెకి అటూ ఇటూ మూటలు వేళ్ళాడేసుకుని ఆ అర్ధరాత్రిపూట జన సంచారం లేనిచోట నదురూ బెదురూ లేకుండా నడిచి వెళ్ళిపోతున్నాడాయన. దారికటూ యిటూ తుప్పలూ ఏవో తీగలూ ముళ్ళపొదలు ఉన్నాయి. అక్కడికి వాళ్ళ గ్రామం ఇప్పటి లెక్కల్లో మూడునాలుగు కిలో మీటర్ల దూరం వుంటుంది. అది సముద్రపు ఒడ్డున వున్న కుగ్రామం. ప్రయాణ సౌకర్యమే కాదు ఏ సౌకర్యమూ అక్కడ లేదనే చెప్పాలి. కాకపోతే ఆ రోజు పౌర్ణమి కావడంతో పుచ్చ పువ్వులా వెన్నెల కాస్తోంది. తెలిసిన దారే కావడం కొంత సులువిచ్చింది.

కొంత దూరం వెళ్ళేసరికి రాఘవశాస్త్రిగారు ఇందాకట్నించీ అనుమానిస్తున్న అడుగుల చప్పుడు దగ్గిరయింది. రూఢీ చేసుకుని శాస్త్రిగారు తల పంకించారు. ఇంకో ఫర్లాంగు దూరం వెళ్తే పిల్లకాలువ వస్తుందిగా- చూద్దాం అనుకున్నాడు. ఆయన కాలువ దాటగానే ఇద్దరు మనుష్యులు కూడా కాలువ దాటబోయినారు. కానీ- నీళ్ళల్లోనే కనిపించకుండా బంధించబడ్డారు. అరుద్దామని నోరు తెరిస్తే మాట రావట్లేదు. బ్బెబ్బె అనే శబ్దం మటుకు వస్తున్నది. నీళ్ళల్లో నించీ కాళ్ళు కదలవు. చేపలూ గ్రటా కరుస్తుంటే కాళ్ళు కదల్చటానికి లేకుండా బిగుసుకుపోయె.

తర్వాత రైలు దిగి వచ్చే వాళ్ళు వీళ్ళను గుర్తుపట్టారు. ఊళ్ళోనూ చుట్టుపక్కలా చిల్లర దొంగతనాలు చేస్తుంటారు. వీళ్ళని చూసి ఆశ్చర్యపోతున్నారు- వాళ్ళు కాపాడమని బెబ్బె అని సంజ్ఞలు చేస్తున్నారు- గురునాథం అడగనే అడిగేశాడు ఏమిశ్రా- ఏమైంది మీకు? ఆ జ్వాలా రాఘవశాస్త్రిగారి వెనక బడలేదు గదా- ఆయన్నేదో పురాతన కాలపు నిధి తవ్వించాలని చాలామంది వచ్చి హైదరాబాదుకి తీసుకుపోయినారు గదా- ఆయన చాలా డబ్బూ బంగారంతో వస్తారని ఓ చూపు చూద్దామని ఇక్కడ మాటేశారా ఏమిషి? తెలివితక్కువ వెధవాయిల్లారా! కొండతో పొట్టేలు ఢీకొడితే ఇంతేమరి- నాకు తెలిసి ఈ ప్రాంతాల్లో ఇంత పటిష్ఠమైన వాగ్బంధం, పాదబంధం చేసే మంత్రవేత్తలు మరొకళ్ళు లేరు. ఆయన మంత్ర కట్టు ఆయనే విప్పాలిగాని మా వల్లకాదు.

గుర్నాథం మాటలకి వాళ్ళిద్దరూ కళ్ళనీళ్ళెట్టుకున్నారు. రాఘవశాస్త్రిగారు ఇంటికెళ్ళేసరికి ఆయన ధర్మపత్ని ఆదిలక్ష్మమ్మ పంచలో కూర్చుని వుంది. పక్కింటి ముసలమ్మ తోడుగా వుందావిడకి. అర్ధరాత్రిదాకా నిద్రపోకుండా ఎదురు చూస్తున్నావా? రైలు దిగిన వాణ్ణి ఇంటికి రాలేననుకున్నావా? లేకపోతే దార్లో దొంగలు ఎత్తుకుపోతారనుకున్నావా? అన్నారాయన నవ్వుతూ.

"ఏమో! నాయనా! దొంగలు దొంగలు అంటూ కెవ్వున అరిచి నిద్రపోతున్నదల్లా లేచి కూర్చుంది ఆదిలక్ష్మి. అమ్మవారు బాలాత్రిపురసుందరి కలలో కనబడి నీ భర్తని దోచుకుందామని దొంగలు కాచుక్కూచున్నారు" అని చెప్పిందిట. అప్పట్నించీ ధ్యానం చేసుకుంటూ కూచున్నాం. అర్ధరాత్రి ఆయె- ఎవరన్నా మగవాళ్ళని ఇస్టేషనుదాకా పోయి చూస్తారా? అని అడగడానికి లేదాయె నాయనా! మొత్తానికి క్షేమంగా వచ్చావు అన్నది పక్కింటి ముసలమ్మ.

"త్రిపురసుందరి కాపాడుతుంటే నాకు భయమేమిటి మామ్మా" అన్నారు శాస్త్రిగారు భార్య అందించిన నీళ్ళతో కాళ్ళు కడుక్కుంటూ-

పొద్దున్నే నిద్ర లేవగానే వాళ్ళిద్దరూ గుర్తొచ్చారు. అయ్యో పాపం- ఆ జీవుల్నింకా బాధించకూడదు- అని ఇన్ని నీళ్ళు మంత్రించి వాకిట్లో చల్లారాయన-

ఆయన పూజ పూర్తయ్యేసరికి ఆ ఇద్దరూ వాకిట్లోకొచ్చి మా బుద్ధి గడ్డితింది. ఈ తప్పు కాయండి బాబో అని అరవసాగారు.

భార్యని పిలిచి వాళ్ళ మొహం నాకు చూపించవద్దని చెప్పి పంపెయ్యమన్నారు శాస్త్రిగారు.

కలలో కనబడి చెప్పిన బాలాత్రిపురసుందరికి అంజలి ఘటించింది ఆదిలక్ష్మమ్మ.

భోజనాలు కాంగానే తమలపాకులు అందిస్తూ "మొత్తానికి మా పూరింటి మా రాజు ఘటికుడే- వాళ్ళేకాదు ఇంక ఎవరూ మీ జోలికి రారు"- అన్నది.

"పిచ్చిదానా! ఆర్తుల్ని ఆదుకోవడానికి అమ్మవారు ఈ విద్యలన్నీ ప్రసాదించింది కానీ మనం భవనాలు కట్టుకుని సుఖపడటానికా?"

"మన తరం ఏదో ఈ పూరింట్లో కాలం గడిపేస్తాం కానీ మన పిల్లలూ మనమూ- వాళ్ళకైనా తృణమో పణమో ఇవ్వాలిగదా" నిట్టూర్చిందావిడ.

"తృణమంటావా? మన ఇల్లే తృణం కదా- ఇక పణం నువ్వు పోరగా పోరగా హైదరాబాదు ఈశ్వరయ్యా వాళ్ళు మరీ మరీ బలవంతం చెయ్యగా- తీసుకురాక తప్పలేదు- నిన్న నేను తెచ్చిన మూటలు తీసుకురా"-

ఆదిలక్ష్మమ్మ మూటలు తెచ్చింది- ఎప్పటిలా ఏ కూరగాయలో పప్పులో ధాన్యమో తెచ్చారేమో అనుకుంటూనూ- బట్టల మధ్యనించీ పట్టుచీరా రవికా, అత్తా కోడలంచు మంచి జామారూ తీసి భార్యకిచ్చారు శాస్త్రిగారు నవ్వుతూ-

"అమ్మో- పట్టుచీరే? నేను పుట్టాక మన పెళ్ళిలో కూడా ఎప్పుడూ పట్టుచీర కట్టుకోలేదండీ-" మురిసిపోయిందావిడ-

"నీ మొహం- మన పెళ్ళినాటికి నువ్వు ఎనిమిదేళ్ళ పిల్లవి. అర్భనాకా రంగా వుండేదానివి. పరికిణా కట్టుకున్నా జారిపోతుండేది" అన్నారాయన.

"ఈ బట్టలు వాళ్ళు పెట్టారా? ధోవతులు కూడా చాలా బావున్నై. మీలాంటి మహా పండితులు నీర్కావి ధోవతి కట్టుకుంటుంటే నా మనస్సు తరుక్కుపోతున్నది."

"నీ ముచ్చట తీర్చటానికే వాళ్ళిచ్చినవి తీసుకు వచ్చాను. సరే- ఇది చూడు." చిన్న గుడ్డ సంచీలో నించీ బంగారు హారం తీసిచ్చారు శాస్త్రిగారు- అది నాలుగు పేటల బంతి పూల చంద్రహారం.

"ఇలాంటి నగలు నేనెప్పుడూ- ముట్టుకుని ఎరగను. ఎంత బరువో ఇది మనదేనా? నిజంగా?"

"నల్లపూసలోకి తెల్లపూస లేకుండా వున్నావనే ఈ గొలుసు తెచ్చాను- పోనీ ఇలాంటివి చూశావా ఎప్పుడన్నా?" నవ్వుతూ సింహ తలాటపు మురుగులూ. నవరత్నాల లాకెట్‌తో వున్న బంగారు నెక్లెస్ భార్య చేతికిచ్చారు శాస్త్రిగారు.

ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ "ఇంత ఖరీదైనవి మనలాంటి బీద వాళ్ళం వేసుకుంటే నష్టమేమోనండీ" అన్నదావిడ.

"ఆ సొమ్ముల్లో అన్నిటికన్నా తక్కువ ఖరీదువివ్వేనే."

"నాలుగు పేటలూ విడగొట్టి ఇద్దరమ్మాయిలకీ ఇద్దరు కోడళ్ళకీ ఒక్కొక్క పేటగా చేయిస్తాను. ఈ పొట్టి గొలుసు ఏ పేరంటానికో వెళ్తున్నప్పుడు నేను వేసుకుంటాను. చిన్నమ్మాయి పెళ్ళిలో దానికే పెట్టేస్తాను. ఆ సింహ తలాటాలు మీకే" ఆలోచించి తేల్చేసిందామె.

సరే- నీ యిష్టం ఈ వెయ్యినూటపదహార్లూ కూడా దాచు. పెంకుటిల్లో అంటున్నావుగా. అసలు వాళ్ళు అయిదు వేలు ఇస్తామనీ గొడవ -వద్దన్నాను.

"అయిదు వేలే- వద్దండీ అంత డబ్బు- ఇప్పటికే నాకోసం మీ నియమాన్ని ఉల్లంఘించి ఇవన్నీ తెచ్చారు."

"వాళ్ళింకా ఇస్తామన్నారు- నేనే పుచ్చుకోలేదు- అది లక్షల రూపాయల నిధి. ఈశ్వరయ్య ఏదో పాత ఇల్లు అమ్మకాని కుందంటే చవగ్గా కొన్నాడు. దాన్ని పగలకొట్టి కొత్త యిల్లు కడదామనుకున్నాడు. ఒక గోడలోనించీ గలగలలు, మూలుగులు విన్పించసాగినై. దాన్ని పడగొట్టనివ్వకుండా ఎన్నో అడ్డంకులు. ఎప్పటిదో రాజమందిరం పునాది మీద తెలుసో తెలీకో ఆ ఇల్లు కట్టారు. ఈ గోడ సరిగ్గా ఆ రాజు ఖజానా మీద వుంది. అప్పటి మంత్ర వేత్తలు ఏ కారణం చేతనో ఆ ధనలక్ష్మిని నిర్బంధం చేశారు. ధనం ప్రజలకి ఉపయోగపడకుండా వృధాగా దిబ్బవేసుకుపోయి వుంటే మూలగకుండా ఎలా వుంటుంది? పది మందితో యాగం చేశాం- తర్వాత

విధివిధానంగా ఆ మంత్ర కట్టుకి ప్రతి క్రియ చేశాను- శ్రీ మహాలక్ష్మి ప్రసన్నమైంది. సగం డబ్బుని దానధర్మాలకి వాడమన్నాను- ఒక దేవాలయం కూడా కట్టించమన్నాను అమ్మవారికి" అంటూ నులక మంచం మీద వాలారు శాస్త్రిగారు- నిశ్చింతగా నిద్ర పట్టేసిందాయనకి ఇన్నాళ్ళ అలసటవల్ల- ఆ తర్వాత శాస్త్రిగారు బాలా త్రిపురసుందరీ ఉపాసన చేస్తూ, అనేక పుణ్యకార్యాలు చేస్తూ దాదాపు నలభై సంవత్సరాలు గడిపారు. పండు ముసలి వయసులో ఆయన కళ్ళకి శుక్లాలు వచ్చాయి. త్వరగా ఆపరేషను చేయించుకోవాలని చెప్పాడు డాక్టరైన ఒక శిష్యుడు. తనతోపాటు హైదరాబాదు తీసుకెళ్ళి తనకి తెల్సిన కంటి డాక్టరు చేత ఆపరేషన్ చేయిస్తానన్నాడు. శాస్త్రిగారు రానన్నారు. అక్కడికి నలభై మైళ్ళ దూరంలో ఒక టౌన్ వుంది. మేము కారు తీసుకొస్తాం. టౌన్ కెళ్ళి ఆపరేషను చేయించుకోండి" అని కొందరు శిష్యులు ఎంతో చెప్పారు.

"ఇంకొకరి కారు ఉచితంగా వాడుకోను" అంటూ బస్సులో వెళ్ళి ఆపరేషన్ చేయించుకున్నారు. తిరిగి వచ్చేప్పుడు కూడా బస్సే. ఆ గతుకుల రోడ్డులో బస్సు ఎగిరెగిరి పడుతూ ప్రయాణించడంవల్ల ఇంకా పచ్చిగా వున్న ఆయన కన్ను అదిరి చూపు తగ్గిపోయింది. రానురాను రెండు చేతుల్లో రెండు కఱ్ఱలు పట్టుకు నడుస్తారు కానీ ఎవర్నీ పట్టుకోనివ్వరు. తొంభై ఏళ్ళ ఆ వృద్ధుడి ఆత్మవిశ్వాసానికి కారుల్లో వెళ్ళే నాగరీక జనం సిగ్గుపడవలసి వచ్చేది.

ఎనభై ఏళ్ళు పైబడిన ఆదిలక్ష్మమ్మ కోడళ్ళ సాయంతో వంట చేస్తుంది. ఆవిడ జిమ్‌కెళ్ళకపోయినా సన్నగానే వుంటుంది. బ్యూటీపార్లర్ చుట్టూ తిరగకపోయినా చక్కగా వుంటుంది. జుట్టు పూర్తిగా తెల్లబడలేదు. పాపిడి తీసుకుని రోజూ నూనె రాసుకుని దువ్వుకుని ముడివేసుకున్నా- ఆవిడ కళకళ లాడుతూనే వుంటుంది. జుట్టు విరబోసుకుని నూనె మొహం ఎరగని ఎర్రని, తెల్లని జుట్టు ఎరగదామె. మాటిమాటికీ జుట్టు ఎగదోసుకుంటూ ముందుకు పీక్కుంటూ బొట్టూ పూలూ లేని ఆడవాళ్ళుంటారని విని విస్తుపోతుంది. ఆవిడ 60 ఏళ్ళు పైబడ్డాక కూడా చెరువునించీ నీళ్ళు తెచ్చేది. పనిమనిషి లేదు. బావిలో నించీ నీళ్ళు తోడేది. పిండి విసరటం, దంచటం, జల్లించటం, చెరగటం, రుబ్బటం, వాకిట్లో కళాపి జల్లి ముగ్గువెయ్యడం, దొడ్లో కూరగాయల్ని పండించటం, తాజాగా వాటిని కోసుకొచ్చి వండడం- ఇలాంటివే ఆవిడ సౌందర్య రహస్యాలు- నుదుట చక్కగా కుంకుమ బొట్టూ, చిన్న ముడితో ఏదో పువ్వూ పసుపుతాడూ నల్లపూసలూ చేనేత చీరా రవికా మొహాన చిరునవ్వూ సంతృప్తీ, వచ్చినవాళ్ళందర్నీ ప్రేమగా పలకరించటం ఇవీ ఆవిడ ఆభరణాలు-

ఆ పుణ్యదంపతులంటే చుట్టుప్రక్కల గ్రామాలల్లో కూడా గొప్ప గౌరవభావం- ఇప్పటికి చిన్న టీ.వీ. కొన్నారు కొడుకులు.

మధ్యాహ్నమైందంటే దూరదూరాల్నించీ జనం వస్తూనే వుంటారు- శాస్త్రిగారికొక కన్ను దెబ్బతిన్నా అంతశ్చక్షువులు శక్తిమంతంగా వున్నాయి. ఒకరికి వీరభద్ర పళ్ళెం పెట్టించమనీ ఒకరికి వారావించేయించమనీ రకరకాల నివారణోపాయాలు చెప్తుంటారాయన. రెండు పళ్ళూ, తాంబూలం, 11 రూపాయలూ ఇస్తారు జనం- వాళ్ళల్లో దోషులెవరన్నా వుంటే వాళ్ళకి చెప్పరు వెళ్ళిపొమ్మంటారు.

ఒకనాడు పార్వతి అనే మధ్యవయసు స్త్రీ వచ్చింది. ఆమె నెత్తిమీద ఆభరణాల మూట కనపడింది శాస్త్రిగారు ఒక్కరికీ.

"బాబుగారూ! హైదరాబాదు ఈశ్వరయ్యగారి కోడలు నాతో కలిసి పనిచేస్తోంది. ఆవిడ మా ఇంటి పరిస్థితి చూసి మీ దగ్గిరికి వెళ్ళమని చెప్పింది"అన్నది.

"అట్లాగా? మీ ఇంట్లో నువ్వూ మీ కుటుంబమంతా పడుతున్న బాధలు అర్థమైనాయి. పగవాళ్ళక్కూడా అలాంటి బాధలు రాకూడదమ్మా. మేడిపండులాంటి నీ సంసారాన్ని కాపాడటానికి శతవిధాల ప్రయత్నిస్తాను. నా దగ్గిరికి వచ్చేటప్పుడు చాలా అడ్డంకులొచ్చినై గదూ? ఎట్లాగో వచ్చావుగదా ఇంక నీకు భయం లేదు"- అన్నారు శాస్త్రిగారు.

"ధన్యురాల్ని. అసలు మా యింట్లో అంత గోల దేనికి? అన్ని బాధలు ఎందుకొచ్చాయి? వాటి నివారణ ఏమిటో దయచేసి చెప్పండి" అని అడిగింది రుద్ధకంఠంతో పార్వతి.

"అమ్మాయి! నువ్వు పూర్వజన్మలో దేవీ ఉపాసకురాలివి. ఆ సాధన పూర్తికాకముందే జన్మ ముగిసిపోయింది! యోగభ్రష్టోభిజాయతే. ఈ జన్మలోనూ నువ్వు మహాభక్తురాలివి. నువ్వు అత్తవారింట అడుగుపెట్టగానే జడ స్థితిలో వున్న అక్కడి దుష్టశక్తులు రెచ్చిపోయాయి. మీ యిల్లు చాలా పెద్దదిగదా- మీ వాళ్ళు బాగా డబ్బు సంపాదిస్తున్నారని ఈర్ష్యతో ఒకరు మహాప్రయోగం చేశారు. ఇంకొకరు చిల్లంగి, బాణామతి లాంటివి వేరే కారణాలవల్ల ప్రయోగించారు. మీది సమష్టి కుటుంబంగదా-"అని ఇంట్లో ఎన్ని గదులున్నాయో ఇంటి పక్కల వాళ్ళు ఎవరో అన్నీ చెప్పారాయన అంతా అంతర్నేత్రాలతో చూస్తూ. పార్వతి ఆశ్చర్యపోయింది.

శాస్త్రిగారికొక కన్ను దెబ్బతిన్నా అంతశ్చక్షువులు శక్తిమంతంగా వున్నాయి. ఒకరికి వీరభద్ర పళ్ళెం పెట్టించమనీ ఒకరికి వారావించేయించమనీ రకరకాల నివారణోపాయాలు చెప్తుంటారాయన. రెండు పళ్ళూ, తాంబూలం, 11 రూపాయలూ ఇస్తారు జనం- వాళ్ళల్లో దోషులెవరన్నా వుంటే వాళ్ళకి చెప్పరు వెళ్ళిపొమ్మంటారు.

ఆ ఇల్లు ఖాళీచేస్తే మంచిది- కానీ అది జరిగే పనికాదు. నేను ఒక నరసింహ స్తోత్రం చెప్తాను- రాసుకో. జాగ్రత్తగా చదవాలి సుమా- అన్నీ బీజాక్షరాలు. ఈ స్తోత్రం రోజుకి వెయ్యి పర్యాయాల చొప్పున నలభైఒక్క రోజులు పఠించాలి. పానకం, వడ పప్పు నైవేద్యం- మంగళవారం మరీ ముఖ్యం- మీ యింట్లో నించీ దట్టమైన పొగలు వస్తున్నట్టు కనబడుతున్నది. నరసింహ సాలగ్రామానికి మీ పూర్వులెవరో అపచారం చేసినట్టున్నారు. అందుకు పరిహారం చెప్పాను.

ఇంకా- భయపడకుండా విను. మీ యింట్లో చిన్నవీ పొన్నవీ చాలా ఆత్మలున్నాయి. శ్రీదేవి నీయందు కృప గలిగి వున్నది- మీ భూత్‌బంగళాను నువ్వేకాపాడుకోవాలి. సీతా అనసూయా అరుంధతీత్యాది సతీమతల్లుల అంశ ఈ కలియుగంలో నీలో గోచరిస్తున్నది" అన్నారు శాస్త్రిగారు.

ఉద్వేగంతో వినయంతో పార్వతి చేతులు జోడించింది. మందహాసం చేశారు శాస్త్రిగారు.

"పూర్వం మీ యింట్లో పెద్ద మోట బావి వుండేది. తెలుసా?" అని అడిగారు. "విన్నాను. మా అత్తగారి అత్తగారు ఒకసారి చెప్పారు." ఆశ్చర్యంగా చెప్పింది పార్వతి.

"ఆ మోట బావే నీ కథకి మూలం. నూట పదహారు ఏళ్ళ కిందట ఇప్పుడు మీ యిల్లున్నచోట చిన్నపాటి రాజాస్థానమేదో వుండేది. వాళ్ళు తెలుగువాళ్ళు కారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల వాళ్ళయి వుండవచ్చు...

ఊపిరి బిగబట్టి వింటోంది పార్వతి.

"ఆ రాజాధికారికి పంధొమ్మిదేళ్ళ చక్కని కూతురుండేది. పెళ్ళి నిశ్చయమైంది. చెలికత్తెలతో సంతోషంగా ఆ పిల్ల ఆటపాటలతో వినోదిస్తుండంగా దొంగలు దాడి చేశారు."

"అంటే... ధగ్గులు, పిండారీలు అలాంటి వాళ్ళా? లేకపోతే శత్రువులెవరన్నానా?"

"అది తెలియదు- కానీ అలాంటి వాళ్ళే- అక్కడి ధనాన్నీ కన్యా ధనాన్నీ దోచుకుపోవాలనే వచ్చారు."

పార్వతి వెంట్రుకలు నిక్కబొడుచుకున్నై.

"వేరే దారిలేక శీల సంరక్షణకోసం చెలికత్తెలతోపాటు ఆ అమ్మాయి కూడా ఈ మోట బావిలోకి దూకి తనువు చాలించుకుంది."

"అయ్యో- పాపం".

"ఆ పిల్ల ఖర్మ అలా వుంది పాపం. తర్వాత ఆ పిల్ల శరీరాన్ని సకలాభరణాలతో అలంకరించి ఇప్పుడు మీ ప్రహరీ గోడ దగ్గిరున్న బాదం చెట్టు కింద ఖననం చేశారు. ఇక అక్కడ వుండలేక -దొంగల పోరులో మిగిలినవారు ఆ స్థలం అమ్మేసుకుని వాళ్ళ ప్రాంతం వెళ్ళిపోయారు. ఆ కొన్న వాళ్ళు నలుగురన్నదమ్ములు- వాళ్ళ పిల్లలు పది మంది- ఆ పది మందిలో ఒకరి భాగాన్ని మీ మామగారి తండ్రి కొన్నాడన్న మాట. ఇన్నేళ్ళుగా ఆ రాజాధికారి కూతురి ఆత్మవిముక్తి లేక కొట్టుకుంటున్నది. మిగిలిన అమ్మాయిలకి వాళ్ళవాళ్ళ ఆచారాల రీత్యా అంత్యక్రియలు జరిగాయి కాని-

"కాని?"

"ఈ అమ్మాయి అస్థిపంజరం ఆభరణాలతో బంధించబడి వున్నది. అవి తీసి మళ్ళీ పరిహారం చెయ్యాలి. అప్పుడు గాని ఆ అత్మఘోష తగ్గి విముక్తి లభించదు. ఆ పిల్ల ఆత్మవిముక్తి చెందితేనే గాని ఆ చోటులో ఏ పిల్ల పెళ్ళీ నిలవదు. నీ పిల్లల విషయం కూడా దీనితో నిబద్ధింపబడి వుంది"-

పార్వతి కళ్ళల్లో భయం- "మరి ఈ పరిహారం ఇదంతా ఎట్లా?"అని అడిగింది.

"నీ ద్వారానే జరగాలి. ఎన్ని జన్మల లింకులు ఎంత నేర్పుగా అల్లుకుంటూ వస్తాడో చూశావో భగవంతుడు- నువ్వు అప్పుడు ఆ అమ్మాయికి ప్రాణ సఖివి. తనతోపాటు ప్రాణాలు అర్పించి తర్వాతి జన్మల్లో నీ పూర్వ పుణ్యవశం చేత శ్రీదేవీ జపం కొన్ని లక్షలు చేస్తూ వచ్చావు. ఇక్కడికి కోడలివై వచ్చి నీ పాత స్నేహితురాల్ని విడిపించి ఈ జన్మలో నీ తపస్సు పండించుకుని తర్వాత పునరావృత్తి రహితమైన మోక్షపదం పొందుతావు. ఆధునికులకిది హాస్యాస్పదంగా తోచవచ్చు. అలాంటి అనుమానం తీరాలంటే ఆ చోటు తవ్వి చూడమను. వాళ్ళ ప్రాణాలు నిలవవు. క్రియా కలాపం సరిగ్గా నిర్వహించి గాని బయటికి తియ్యటానికి వీలులేదు. అప్పుడే నీ కుటుంబానికీ క్షేమం. సొమ్ములు మోక్షానికి ఆటంకాలు. నా వయసైపోయింది. ఫలానా వూళ్ళో విఘ్నేశ్వర సోమయాజిగారు నీకు సహాయం చేయగలరు. శుభం వెళ్ళిరా" అన్నారు జ్వాలా రాఘవశాస్త్రిగారు.

ఇలా ఎన్నో విషయాలు చెప్పి మంత్ర శాస్త్రమును రుజువు చేసి తొంభయ్యారేళ్ళకి పరమపదించారు శాస్త్రిగారు. కన్నీళ్ళతో ఎక్కడెక్కడినించో శిష్యులు పరిగెత్తుకొచ్చారు. ఆ మహనీయుడి పార్థివ శరీరాన్ని దహనం చేస్తుంటే బాలాత్రిపుర సుందరీ సౌందర్య లహరి అంచున్న తెల్లటి పట్టుచీర కట్టుకున్న స్త్రీగా ఆకాశానికెగసి, అందులో కలిసిపోయింది. శాస్త్రిగారి శరీరాన్ని వదిలిపెట్టి బాలా మహామంత్ర శక్తి వెళ్ళిపోతున్నదని గ్రహించి శిష్యులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జయ! జయ! జ్వాలాంబా! జగన్మోహినీ! బాలా! అమ్మలగన్న అమ్మా! ప్రజలందరిలో దయవై, శాంతివై, శక్తివై, సర్వమై భాసించే తల్లీ. బాలాత్రిపురసుందరీ! బగళాముఖీ! దేవీ! నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః అని ముక్తకంఠంతో భజించారు. ★